
సాక్షి ఒడిశా
శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7.30.327లు, బంగారం 5గ్రాము 330 మిల్లీగ్రాములు, వెండి 54 గ్రాములు 30 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'చిల్లర' పంచాయితీ..!

కేవలం రూ.3 చిల్లర తిరిగి ఇవ్వనందుకు షాపు యజమాని రూ.25,000 జరిమానా చెల్లించాలని వినియోగదారుల ఫోరం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

- 8లో.



వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

కటక్ నగరం చౌదరి బజార్‌లోని ఒక వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది.

- 8లో.

న్యూస్‌రీల్

నిజ నిర్ధారణ బృందం పర్యటన



పోలీసుస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయగడ: ఈనెల 22వ తేదీన జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి ఆశ్రమ పాఠశాలలో 8 ఏళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి నిజ నిర్ధారణకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ఆదేశాల మేరకు పార్టీకి చెందిన ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్ డొంగాశిలిలో శుక్రవారం పర్యటించింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు రత్నమణి ఉలక ఈ టీమ్‌కు చైర్మన్‌గా వ్యవహరించగా ఆమె నేతృత్వంలో న్యాయవాది సదనంద నాయక్, సమితి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంగద్ నాయక్, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాజేంద్ర దురియా, సభ్యుడు జోగేంద్ర ప్రసాద్ నాయక్, జిల్లా పరిషత్ సభ్యుడు రంజిత్ నాయక్, గౌరి నాయక్, హుటాషన్ నాయక్‌లు గ్రామాన్ని సందర్శించారు. ముందుగా ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన ఈ బృందం అక్కడ వాస్తవ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి దారుణ సంఘటన చోటుచేసుకోవడం వెనుక గల దోషులకు కఠినంగా శిక్షపడేలా తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. అనంతరం డొంగాశిలి పోలీసు స్టేషన్‌కు వెళ్లిన బృందం సభ్యులు కేసుపై ఐఐసీతో మాట్లాడారు. అలాగే ఆరోజు పోలీసు వ్యాన్‌ను తగలబెట్టినవారిలో నిర్ధోషులపై కేసులు కొట్టివేయాలని కోరారు. అనంతరం రాయగడకు చేరుకున్న బృంద సభ్యులు తాము సేకరించిన వివరాలను పీసీసీ అధ్యక్షునికి తెలియజేస్తామన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని రత్నమణి ఉలక డిమాండ్ చేశారు. అదేవిధంగా డొంగాశిలిలో శాంతియుత వాతావరణం తీసుకువచ్చేలా కృషి చేయాలని కోరారు.

రాష్ట్రంలో రైతుల ఆదాయం పెరిగింది

- వ్యవసాయ శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి

భువనేశ్వర్: రాష్ట్రంలో రైతు కుటుంబ ఆదాయం 2013 సంవత్సరంతో పోలిస్తే 2019 సంవత్సరంలో 2.73% పెరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్ర శాసనసభలో ఖండపడా ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ వ్యవసాయ, రైతు సాధికారత విభాగం మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి ఈ విషయాన్ని వెల్లడించారు. రైతు కుటుంబాల ఆదాయాన్ని అంచనా వేయడానికి డైరెక్టరేట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ఎకనామిక్స్ ఆఫ్ స్టేట్ తరచూ సర్వేలు నిర్వహించడం లేదని మంత్రి తెలియజేశారు. కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ నమూనా సర్వే కార్యాలయం ఈ సర్వే నిర్వహించిందన్నారు. జాతీయ నమూనా సర్వే కార్యాలయం 69, 70 మరియు 77వ సర్వే రౌండ్‌లలో రైతుల నెలవారీ ఆదాయంపై వివరాలు సేకరించినట్లు చెప్పారు. 59వ రౌండ్ (జనవరి - డిసెంబర్ 2003) నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఒక రైతు కుటుంబం నెలవారీ సగటు ఆదాయం రూ.1,062 కాగా, 70వ రౌండ్ (జనవరి - డిసెంబర్ 2013) నివేదిక ప్రకారం ఒక రైతు కుటుంబం నెలవారీ సగటు ఆదాయం రూ.4,976లు కాగా, 77వ రౌండ్ నివేదిక ప్రకారం ఒక రైతు కుటుంబం నెలవారీ సగటు ఆదాయం రూ.5,112 అని మంత్రి వివరించారు. 2015-16తో పోలిస్తే 2022-23లో వరి, వరియేతర పంటల దిగుబడి పెరిగిందన్నారు.

25 కొత్త జిల్లాల ఏర్పాటుకు అర్జీలు

భువనేశ్వర్: 25 కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ (ఆర్ అండ్‌డీఎం) శాఖకు పలు అర్జీలు అందాయి. రాష్ట్ర శాసనసభలో కెంజొహర్ బీజేపీ ఎమ్మెల్యే మోహన్ చరణ్ మాఝీ అడిగిన ప్రశ్నకు, ఆ విభాగం మంత్రి సుదామ్ మరాండి సమాధానమిస్తూ.. 25 కొత్త జిల్లాల ఏర్పాటు కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అర్జీలు అందాయని తెలిపారు. పదంపూర్, ధర్మగఢ్, పశ్చిమ మయూర్‌భంజ్, రాయ్‌రంగ్‌పూర్, ఖిచింగ్, బొణై, రౌర్కెలా, టిట్లాగఢ్, కంటాబంజీ, తాల్చేర్, పల్లాలాహాడా, అఠొమల్లిక్, భువనేశ్వర్, ఘుముసర్, రుషికుల్య, బరంపురం, భంజనగర్, చండిఖోల్, అఠొగాడా, కుచిండా, బలిగూడ, ఆనంద్‌పూర్, నీలగిరి, సొరో, గుణుపురం, భంజనగర్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు కోసం డిపార్ట్‌మెంట్ అర్జీలను స్వీకరించిందన్నారు. అలాగే రౌర్కెలా జిల్లా ఏర్పాటు కోసం ప్రస్తుతం ఉన్న సుందర్‌గఢ్ జిల్లాను విభజించవద్దని సైతం కోరుతూ కొన్ని పిటిషన్లు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ (యూనిట్) చట్టం -1963 ఆధారంగా కొత్త జిల్లాల ఏర్పాటు కోసం వచ్చిన పిటిషన్లపై, ప్రభుత్వం తగిన సమయంలో తగిన చర్యలు తీసుకుంటుందన్నారు.

తెరుచుకోనున్న రత్న భాండాగార్..?

- పిల్‌పై తీర్పు వెల్లడించిన హైకోర్టు
- ఉన్నత స్థాయి ప్యానెల్ ఏర్పాటు చేయాలని ఆదేశం



భువనేశ్వర్: శ్రీజగన్నాథ ఆలయ రత్న భాండాగార్ సమస్యపై ఉన్నత స్థాయి ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని ఒడిశా హైకోర్టు శుక్రవారం ఆలయ నిర్వహణ కమిటీని ఆదేశించింది. కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాసిస్ తలపాత్ర, జస్టిస్ సావిత్రి రాథోలతో కూడిన డివిజన్ బెంచ్ రెండు నెలల సమయం ఇచ్చింది. ఆలయ నిర్వహణ కమిటీ తరపున సీనియర్ న్యాయవాది బుద్ధదేవ్ రౌత్రాయ్, పిటిషనర్, బీజేపీ నాయకుడు సమీర్ మొహంతి తరపున సీనియర్ న్యాయవాది పీతాంబర్ ఆచార్య దాఖలు చేసిన వాదనలను విన్న తర్వాత ధర్మాసనం సెప్టెంబర్ 27న తీర్పును రిజర్వ్ చేసింది. దీనిలో భాగంగా శుక్రవారం తీర్పు వెల్లడించింది. దీంతో రత్న భాండాగార్ తెరుచుకోవడానికి అవకాశాలు ఉన్నాయని సర్వత్రా చర్చనీయాంశమైంది.

ప్రజల విజయమిది

ఈ సందర్భంగా మీడియాతో ఆచార్య మాట్లాడుతూ ఈ తీర్పు ఒడిశాలోని 4.5 కోట్ల మంది ప్రజల విజయమన్నారు. సాధారణంగా బీజేడీ ప్రభుత్వం 2024 అక్టోబర్ వరకు సమస్యను వాయిదా వేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ తీర్పుతో రత్న భాండాగారాన్ని తిరిగి తెరవడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే సమీర్ మొహంతి పిల్ దాఖలు చేశారన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనను కూడా కోర్టు తిరస్కరించిందని తెలియజేశారు. రత్న భాండాగార్ భద్రత పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా (ఏఐ)పై ఆధారపడి ఉంటుందన్నారు. తనిఖీ కోసం వీలైనంత త్వరగా తెరవాలని ఏఐ తన అఫిడవిట్‌లో స్పష్టం చేసిందన్నారు. ఏఎస్ఐతో ఏకీభవించిన హైకోర్టు రెండు నెలల్లోగా ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గ్యాంగ్‌స్టర్ సునీల్ నాహక్ హత్య



సునీల్ నాహక్ (ఫైల్)



రక్తపు మడుగులో సునీల్ నాహక్ మృతదేహం

బరంపురం: గత కొన్ని రోజులుగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న గంజాం జిల్లాకు చెందిన గ్యాంగ్‌స్టర్ సునీల్ నాహక్ గురువారం రాత్రి కుదలాలో గుర్తు తెలియని దుండగుల చేతిలో హత్యకు గురయ్యాడు. ఏఎస్పీ రమేష్ చంద్ర సెఠి తెలిపిన వివరాల మేరకు.. అస్కా పోలీసుస్టేషన్ పరిధి బొడగాం గ్రామానికి చెందిన గ్యాంగ్‌స్టర్ సునీల్ నాహక్‌ను కుదలా పోలీసుస్టేషన్ పరిధి ధర్మగడ గ్రామంలో దుండగులు మారణాయుధాలతో హత్యచేసి పరారయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు తరలించారు. హత్యకు గురైన సునీల్ నాహక్ కొద్ది నెలల క్రితం అస్కాలో హనుమాన్ కోయన్‌కి సంబంధించి డబుల్ మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. అలాగే ఆయనపై వివిధ పోలీసుస్టేషన్లలో పదుల సంఖ్యలో గంజాయి కేసులు, పలు నేరారోపణలు ఉన్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు పరారైన నిందితులను గాలిస్తున్నారు.

విజిలెన్స్ వలలో ఏఈ



దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్ సిబ్బంది (సర్కిల్‌లో) అసిస్టెంట్ ఇంజినీర్ మల్లిక్

రాయగడ: స్థానిక సెరిగుడ కూడలి సమీపంలోని ప్రజారోగ్య శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఎస్టిమేట్ విభాగం)గా విధులు నిర్వహిస్తున్న రమాకాంత్ మల్లిక్ శుక్రవారం విజిలెన్స్ వలలో చిక్కుకున్నాడు. ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.7 వేల లంచం తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. సుమంత్ పారిడా అనే కాంట్రాక్టర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో జంఝావతి పంప్ హౌస్ వద్ద మరమ్మతుల పనులు పూర్తి చేశాడు. అందుకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సిందిగా అసిస్టెంట్ ఇంజినీర్ మల్లిక్‌ను పలుమార్లు ప్రాధేయపడ్డాడు. ఈ క్రమంలో మల్లిక్ కాంట్రాక్టర్‌కు రూ.7 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులకు కాంట్రాక్టర్ పారిడా ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో కొరాపుట్ విజిలెన్స్ ఏఎస్పీ అరుణ్ కుమార్ నాయక్, ఇన్‌స్పెక్టర్ తరుణలత బెహెర సిబ్బంది ఒక పథకం ప్రకారం నిర్వహించిన దాడిలో అసిస్టెంట్ ఇంజినీర్ తీసుకుంటూ పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన విజిలెన్స్ అధికారులు, మల్లిక్‌కు సంబంధించిన మరో మూడు ప్రాంతాల్లో దాడులను నిర్వహించినట్లు సమాచారం.

● నివాళి



ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం



సంతాపం తెలుపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి జిల్లాలోని ఆర్.సీతాపురంలో ఉన్నటువంటి సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో శుక్రవారం సంతాపం తెలియజేశారు. ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా.ఎం.దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి జ్యోతిని వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదు అనేదే స్వామినాథన్ ఆశయమన్నారు. వ్యవసాయ రంగంలో ధాన్యం, గోధుమల పంట అధిక దిగుబడికి అనేక పరిశోధనలు చేశారని తెలియజేశారు. చెన్నైలో అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలకు గానూ ఆయనకు అనేక అవార్డులు వరించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ప్రొ.అనిల్ కుమార్, డీన్ డా.ఎస్.పి.నందా, డైరెక్టర్ (అడ్మిషన్స్) డా.దుర్గాప్రసాద్ పాఢి, డా.పి.కళ్యాణ చక్రవర్తి, ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

– పర్లాకిమిడి

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

బరంపురం: నగర శివారు పెద్ద బజార్ పోలీసు స్టేషన్ పరిధి హనుమాన్ నగర జంక్షన్‌లో కొద్ది రోజుల నుంచి రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి భూషన్ మహంతి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం హనుమాన్ నగర జంక్షన్‌లో ఉన్న ఒక ఇంటిలో రహస్యంగా జూదం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్ ఆదేశాలతో పెద్ద బజార్ పోలీసులు దాడిచేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.44,660 వేల నగదు, మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

లగేజీ వ్యాన్ బోల్తా

- 8 మందికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ



బోల్తాపడిన లగేజీ వ్యాన్

జయపురం: లగేజీ వ్యాన్ బోల్తా పడడంతో 8 మందికి తీవ్ర గాయాలైన ఘటన విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారి పలకబస గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ సమితి బిరిగుడ, టంగినిగుడ, పాబలిగుడ, గనిపుట్ గ్రామాల నుంచి 15 మంది మహిళలు ఒక లగేజీ వ్యాన్‌లో మల్కన్‌గిరి జిల్లా గోవిందపల్లి వారాంతపు సంతకు కాయగూరలు అమ్మేందుకు వెళ్లారు. అనంతరం సంత నుంచి తమ గ్రామాలకు తిరిగి వస్తుండగా విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారిలో పలకబస గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి, బోల్తాపడి ఘాట్‌పై నుంచి కిందికి దొర్లింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్నవారందరూ గాయపడ్డారు. అయితే వారిలో 8 మందికి తీవ్రగాయాలు కాగా ఇద్దరు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన బొయిపరిగుడ పోలీసు అధికారి శుశాంత కుమార్ శతపతి సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు.

'రక్తదానంపై అపోహలు వీడాలి'



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: రక్తదానం చేయడం వలన అనారోగ్యాలకు గురవుతామనే అపోహలు యువత విడిచిపెట్టి రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వి.లోక్‌నాథ్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక రైతుల కాలనీ 5వ లైన్‌లో మహా గణపతి ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా ఉత్సవాల్లో సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, అయితే ఈసారి వినూత్నంగా రక్తదాన, వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందించాల్సిన విషయమన్నారు. రక్తదానంతో ఆపద ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి తరహా కార్యక్రమాలు యువత తరచూ నిర్వహించాలని కోరారు. శిబిరంలో మొత్తం 28 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు మహా గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుబాటి రాము తెలియజేశారు.

మెగా వైద్య శిబిరం

స్థానిక సాంస్కృతి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో రైతుల కాలనీ మహా గణపతి ఉత్సవాల్లో భాగంగా మెగా వైద్య శిబిరం సైతం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సుజాత పాలో నేతృత్వంలో జరిగిన శిబిరంలో 159 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సరస్వతి సాహు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 12 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి ఖరడ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపాటుకు 12 మేకలు మృతి చెందాయి. గ్రామ శివారులో మధ్యాహ్నం మేతకు వెళ్లిన మేకలపై ఉరుములు కారణంగా పిడుగు పడడంతో మృతి చెందినట్లు గజపతి జిల్లా యాదవ కుల సంఘం అధ్యక్షుడు ఎ.కులవర్ధనరావు తెలియజేశారు. చనిపోయిన మేకలు సిరిధర గౌడోకు చెందినవి పేర్కొన్నారు. ఘటనపై కాశీనగర్ సమితి పశు సంవర్ధక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేశారు.



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న నాటక మహోత్సవాలు



అలరిస్తున్న రణప్ప నృత్య ప్రదర్శన



ఏక్ సామ్రాజా నాటిక ప్రదర్శన

బరంపురం: స్థానిక హిల్‌పట్నా రోడ్‌లోని బిజూ పట్నాయక్ సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సాహిత్య సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు ఆకట్టుకున్నాయి. బరంపురంలో నాటక మహోత్సవాలు నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందని అతిథిలు పేర్కొన్నారు. ముఖ్యంగా కటక్‌కు చెందిన పంచధ్వని నాట్య పరిషత్ ద్వారా ప్రదర్శింపబడిన 'ఏక్ సామ్రాజా' నాటిక ప్రేక్షకులను కట్టిపడేసింది. అనంతరం స్థానిక కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీ శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, కమిషనర్ సోనాలి జెనా, బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, కార్యదర్శి మిహర్ త్రిపాఠీ, డీపీఆర్ రబి కుమార్ బెహరా, తిరుపతి నాయక్, కె.బలరామ్ సాహు, సత్యబ్రాత దాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాధామాధవ మఠంలో చోరీ

పర్లాకిమిడి: గుసాని సమితి బాగుసల గ్రామంలో ఉన్న రాధామాధవ మఠంలో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం పూజారి మహాప్రభు రాధామాధవ మఠం తలుపులు తెరిచినప్పటికే దేవునికి తొడిగిన 10 తులాల వెండి ఇతర విలువైన వస్తువులు దొంగలు దోచుకున్నట్లు గమనించి గురండి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మఠంకు విచ్చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రాయగడ: జిల్లాలోని మునిగుడ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. మృతుడు సమితిలోని మునిఖాల్ పంచాయతీ హటొపాడొరొ గ్రామానికి చెందిన జగన్నాథ జుమ్మ(56)గా పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు పాలైన జుమ్మ అక్కడిక్కడే మృతి చెందాడు. పరిసర ప్రాంతాల్లోని ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మునిగుడ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ఢీకొట్టి వెళ్లిపోయిన వాహనం గురించి గాలిస్తున్నారు.

ట్రక్ బోల్తా.. ఒకరికి గాయాలు



ట్రక్ బోల్తాపడిన దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గూబులూర్ గ్రామం వద్ద శుక్రవారం ఒక ట్రక్ బోల్తా పడడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి పైపు గొట్టాలతో మల్కన్‌గిరి వస్తున్న ట్రక్ కలిమెల సమీపంలో ఒక ఆటోను తప్పించబోయి పక్కనున్న పంట పొలంలో బోల్తా పడింది. వెంటనే స్థానికులు ట్రక్‌లోని డ్రైవర్‌ను బయటకు తీశారు. ఆయనకు గాయాలవ్వడంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న కలిమెల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రక్‌ను తీసే ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రైవర్ తిరుపతికి చెందిన మహ్మద్ నమ్సేర్‌గా తెలుస్తుంది.

లోలుగు వద్ద 108 వాహనం బోల్తా

పొందూరు: మండలంలోని లోలుగు వద్ద గురువారం అర్ధరాత్రి సంతకవిటి మండలానికి చెందిన 108 వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. సంతకవిటి నుంచి జ్వరంతో బాధపడుతున్న మహిళను శ్రీకాకుళం తీసుకెళ్తుండగా లోలుగు కాలనీ సమపంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 108 సిబ్బందితో పాటు మహిళకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే మరో వాహనంతో శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి. బోల్తా పడిన 108 వాహనాన్ని జేసీబీ సహాయంతో పైకిలేపి మరమ్మతుల కోసం విశాఖకు తరలించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ సుభలయ గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కుక్క దాడిలో గ్రామానికి చెందిన రోళ్ల నరసమ్మ, పిన్నింటి వరదమ్మ, చిన్నారావు, కె.వసంత్, ఎస్.రవి, జి.గణపతి, పి.కృష్ణ, కె.రాము, జె.అప్పలనాయుడు, బాలరాజుతో పాటు మరో ఐదుగురు కుక్కల దాడిలో గాయపడ్డారు. వీరిలో కొందరు స్థానిక హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందగా మరికొందరు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సాయిగీత తెలిపారు. దాడి చేసిన పిచ్చికుక్కను గ్రామస్తులు వెంటాడి చంపినట్లు స్థానికులు తెలిపారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లు పయనం

శ్రీకాకుళం న్యూకాలనీ: నంద్యాల వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు జిల్లా జట్లు శుక్రవారం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లాయి. వీరికి బాల్ బ్యాడ్మింటన్ మైదానంలో క్రీడాదుస్తులు, కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్పాన్సర్‌షిప్ అందించిన ఆదినారాయణ మాస్టారు మాట్లాడుతు గతంలో ప్రతి పల్లెల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలకంటే బాల్ బ్యాడ్మింటన్‌ను ఎక్కువగా ఆడేవారని గుర్తుచేశారు. కాలక్రమేణా ఆటకు ప్రాధాన్యత తగ్గినప్పటికీ.. మళ్లీ కొంతమంది ప్రోత్సాహంతో పుంజుకుందన్నారు. విజయాలతో ట్రోఫీని సాధించి కోచ్‌లకు గురుదక్షిణగా ట్రోఫీని అందివ్వాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పక్కి రమేష్, కోచ్ ఎం.మధుసూధనరావు, సీనియర్ క్రీడాకారులు చిరంజీవి, ఆర్.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో ఇరువర్గాలు ఘర్షణ పడటంతో రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అప్పారావు తెలిపారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు.



అష్టలక్ష్మికి పూజలు

జయపురం మహాత్మాగాంధీ రోడ్డులో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అనేక మంది మహిళలు పాల్గొనగా వారిచే వేద పండితులు పూజలు జరిపించారు. గత 75 ఏళ్లుగా ఇక్కడ ప్రతీ ఏడాది వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తుండడం విశేషం.

– జయపురం

‘చిల్లర’ పంచాయితీ...!

- రూ.3 చిల్లర ఇవ్వనందుకు షాప్ యజమానికి జరిమానా
- రూ.25,000 చెల్లించాలని వినియోగదారుల ఫోరం ఆదేశం
- సకాలంలో చెల్లించకుంటే 9 శాతం వడ్డీ



సంబల్‌పూర్ వినియోగదారుల వివాద పరిష్కార సంస్థ

భువనేశ్వర్: కేవలం రూ.3 చిల్లర తిరిగి ఇవ్వనందుకు షాపు యజమాని రూ.25,000 జరిమానా చెల్లించాలని వినియోగదారుల ఫోరం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సంబల్‌పూర్ బుధరాజా ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీన ప్రఫుల్ల కుమార్ దాస్ జిరాక్స్ తీసుకునేందుకు గోయల్ ప్రింటింగ్ జోన్ జిరాక్స్ సెంటర్‌కు వెళ్లారు. దీనిలో భాగంగా ఒక కాపీ జిరాక్స్ తీయించారు. ఈ నేపథ్యంలో ఆయన దుకాణదారునికి రూ.5 చెల్లించారు. అయితే మిగులు చిల్లర రూ.3 తనకు తిరిగి ఇవ్వక పోవడంతో వివాదానికి దారి తీసింది. మిగులు చిల్లర కోసం దుకాణదారుడిని మర్యాదపూర్వకంగా అడగగా, తనతో దురుసుగా ప్రవర్తించినట్లు వినియోగదారుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా తనను బిచ్చగాడితో పోల్చడంపై విచారం వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితిని తాళలేక వినియోగదారుడు సంబల్‌పూర్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ వివాదం పూర్వాపరాలు పరిశీలించిన కమిషన్ దుకాణదారుడి తప్పిదాన్ని పరిగణనలోకి తీసుకుంది. వినియోగదారునికి తగిన రశీదు లేదా బిల్లు కూడా ఇవ్వనట్లు విచారణలో గుర్తించింది. వినియోగదారుడికి చెల్లించాల్సిన మిగులు చిల్లర రూ.3తో కలిపి అదనంగా రూ.25,000 జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తం నెల రోజుల్లో చెల్లించాలని గడువు కేటాయించింది. గడువు దాటితే మొత్తం చెల్లించేంత వరకు 9 శాతం వడ్డీతో పూర్తి మొత్తం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది.

యాసిడ్ దాడులపై అవగాహన శిబిరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సుమన్ జెన

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ జయపురం వారు ఉమ్మిరి ప్రాంతంలోని ఫార్మసీ కళాశాలలో యాసిడ్ దాడులపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. న్యాయసేవా ప్రదీకరణ జయపురం అధ్యక్షుడు జిల్లా జడ్జి సత్య నారాయణ మిశ్ర ఆదేశం మేరకు నిర్వహించబడిన ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో యాసిడ్ దాడులు పెరుగుతుండడం ఆందోళనకరమన్నారు. ముఖ్యంగా ప్రేమను అంగీకరించలేదనో, మరే ఇతర కారణాల వలనో ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. అటువంటి దాడుల్లో చిన్న గాయమైనా హత్యా ప్రయత్నంగా పరిగణించబడుతుందని తెలియజేశారు. యాసిడ్ దాడులకు పాల్పడిన వారికి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారి డాక్టర్ ఆర్.ఎస్.మిశ్ర, అంబాగుడ పోలీసు పంటి అధికారి రవీంద్రనాథ్ రథ్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లజిక్ కేశని పండ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి

భువనేశ్వర్: స్థానిక ప్రభుత్వ క్యాపిటల్ ఆస్పత్రిలో డెంగీ చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. దీంతో శుక్రవారం ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతురాలు ఖుర్దా జిల్లా బెగుణియాకు చెందిన చంద్రకళా మాన్‌సింగ్ (58)గా గుర్తించారు. వైద్యుడు, ట్రైనీ నర్సు నిర్లక్ష్యం కారణంగానే ఆమె పరిస్థితి విషమించిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారు ఆమెకు సరైన చికిత్స చేయలేదని మండిపడ్డారు. చికిత్స దుష్ప్రభావాల కారణంగా తన తల్లి మరణించిందని ఆమె కుమార్తె సుకాంతి ప్రధాన్ బోరుమంది. అయితే ఈ ఆరోపణలను ఆస్పత్రి డైరెక్టర్ లక్ష్మీధర్ సాహూ తోసిపుచ్చారు. గురువారం మధ్యాహ్నం పీడిత మహిళని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారని, అయితే అప్పటికే ఆమెకు ప్లేట్‌లెట్స్ కౌంట్ తక్కువగా ఉందన్నారు. దీంతో సాయంత్రం ప్లేట్‌లెట్స్ ఇచ్చిన 10–15 నిమిషాల్లో ఆమె మరణించిందని వెల్లడించారు.

డెంగీ ప్రభావంతో రక్తస్రావం లేదా ప్లేట్‌లెట్ మార్పిడి ప్రతిచర్యల కారణంగా ఆమె చనిపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. ఆమె చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం జరగలేదని వివరించారు. అనంతరం పోస్టుమార్టం చేసేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించడంతో మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు తెలిపారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటల్లో ఉన్న వస్త్ర దుకాణం



దగ్ధమైన దుస్తులు

భువనేశ్వర్: కటక్ నగరం చౌదరి బజార్‌లోని ఒక వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. షాపులోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగి క్రమంగా పై అంతస్తులకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 9 బృందాలుగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు నాలుగు గంటల పాటు నిర్విరామంగా శ్రమించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు అదుపులోకి వచ్చినా దట్టమైన పొగలు కమ్ముడంతో అగ్నిమాపక సిబ్బంది భవనం పై అంతస్తులోకి వెళ్లలేకపోయారు. పొగను తగ్గించేందుకు అద్దాలు పగులగొట్టి మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కానప్పటికీ లక్షలాది రూపాయల ఆస్తి అగ్నికి ఆహుతైంది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గుండిచా మందిరానికి రూ.లక్ష విరాళం



విరాళం అందించిన ప్రదీప్ కుమార్ సాహు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో నిర్మితమవుతున్న గుండిచా మందిరానికి ప్రదీప్ కుమార్ సాహు అనే వ్యక్తి రూ.లక్ష విరాళంగా అందించారు. ఖుర్ధాలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సాహు తన తండ్రి జ్ఞాపకార్థం విరాళాన్ని జగన్నాథ మందిర అభివృద్ధి కమిటీకి ఆన్‌లైన్‌లో పంపించారు. సొంత గ్రామమైన గుణుపూర్‌లో మందిరం నిర్మిస్తున్నందుకు తాను ఎంతో సంతోషించి ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. ఒడిశా ప్రముఖ గాయకుడు పండిట్ రఘునాథ్ పాణిగ్రాహికి స్వయాన మేనల్లుడైన సాహు, మందిర నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందించినందుకు మందిర అభివృద్ధి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఈ మందిరం నిర్మితమవుతోంది.


చోరీ కేసు నిందితుడు అరెస్టు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రి

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల బస్టాండ్‌లో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించిన ప్రధాన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 20వ తేదీన బలిమెల బస్టాండ్‌లో మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి చెందిన రాజేష్ మండాల్ జ్వరంతో నిద్రపోతున్న సమయంలో నలుగురు యువకులు రూ.2,500 నగదు, సెల్‌ఫోన్ దొంగలించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు సంతోష్ నాగ్ (23)ను పోలీసుల బృందం ఎంవీ 126 గ్రామంలో అరెస్టు చేశారు. అతని వద్దనున్న సెల్‌ఫోన్, టీవీ, 25,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు బలిమెల ఐఐసీ సుమన్ పటాన్నాయిక్ తెలియజేశారు.

400 సార్లు తిరుమల పాదయాత్ర



శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన మహంతి శ్రీనివాస్ శుక్రవారంతో 400 సార్లు తిరుమల పాదయాత్రను పూర్తిచేశారు. ఆయన 1996 నుంచి తిరుమలకు కాలినడకన వెళ్తున్నారు. ఒక్కో సారి ఒకరోజులు మూడుసార్లు కూడా పాదయాత్ర చేసిన సందర్భాలు ఉన్నాయి. శ్రీవారి అనుగ్రహంతో తాను 400 సార్లు పాదయాత్ర ద్వారా స్వామిని దర్శించుకున్నానని చాలా అదృష్టవంతుడినని అన్నారు.

సహస్ర దీపారాధన



బరంపురం గేటు బజార్ జంక్షన్ చంద్రప్రభా వీధిలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా పూజా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సహస్ర దీపారాధన నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే నగరంలోని వివిధ కూడళ్లలో వినాయక ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

– బరంపురం

జగజ్జనని ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలో డబ్బు లెక్కిస్తున్న పరిచాలన కమిటీ సభ్యులు

జయపురం: స్థానిక జగజ్జననీ ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దీనిలో భాగంగా గత 5 నెలల కాలంలో హుండీలో భక్తులు వేసిన నగదు రూ.8 లక్షలు, కొంత బంగారం, వెండి, ఫిలిపైన్స్ ముద్రలు లభించినట్లు తెలియజేశారు. సెప్టెంబర్ 30వ తేదీ తర్వాత రూ.2 వేల నోట్లు చెల్లుబాటు అవ్వవు కావున ముందుగానే హుండీ లెక్కింపు చేపట్టడం జరిగిందని ఆలయ పూజారులు వల్లభ నారాయణ షాడంగి, రబిరంజన్ కొరొ, మందిర పరిచాలన కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, కార్యదర్శి మాధవ మహంకుడో, సాధారణ కార్యదర్శి ఎం.రమణ, కోశాధికారి సంతోష్ స్వైయ్ తెలియజేశారు. లెక్కింపు సమయంలో కౌన్సిలర్ బిశ్వజిత్ దండసేన, మాధవ రత్, యంజసుందరమ్, లిటు సాహు, శివ పట్నాయిక్, సుధీర్ త్రిపాఠీ, ఎస్.సుందరమ్, హరిహర మల్లిక్, లక్ష్మీ పట్నాయక్, సురేష్ నంద, రబి శంకర్, సుదాంశు దాస్, లక్ష్మణ సాంత్ర తదితరులు ఉన్నారు.

గల్లంతైన ఒడిశా వ్యక్తి మృతి



నీలమాధవ్ పాత్రో (ఫైల్)



గొట్టా బ్యారేజీ వద్ద తేలియాడుతున్న మృతదేహం

హిరమండలం: ఒడిశా కాశీనగర్‌కు చెందిన నీల మాధవ్ పాత్రో(39) హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద వంశధార నదిలో శవమై కనిపించాడు. కాశీనగర్ బ్రాహ్మణ వీధికి చెందిన నీలమాధవ్ పాత్రో ఈ నెల 25న వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్నాడు. వంశధార నదిలో గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో 27వ తేదీన ఒడిశా కాశీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెతికినా ఆచూకీ లేకుండా పోయింది. ఈ తరుణంలో శుక్రవారం గొట్టా బ్యారేజీలో 16వ గేట్ వద్ద మృతదేహం కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హిరమండలం పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే అనుమానంతో గాలింపు చర్యలు చేపడుతున్న కుటుంబ సభ్యులు మృతదేహం నీలమాధవ్ పాత్రోదిగా గుర్తించారు. ఎస్‌ఐ నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెచ్చులూడి విద్యార్థినికి గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థిని

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ72 గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థినులు గురువారం రాత్రి నిద్రపోతున్న సమయంలో స్లాబ్ పెచ్చులూడి పడిపోయాయి. దీంతో ఒక బాలికకు గాయాలయ్యాయి. అయితే వెంటనే ఆ బాలిక కేకలు వేయగా మిగతా విద్యార్థినులు బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. గాయాలైన బాలికను కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. హాస్టల్‌లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 110 మంది బాలికలు ఉంటున్నారు. భవనం మరమ్మతులు కోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అన్నారు. పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాయి స్వర్ణా ప్యాలెస్ ప్రారంభం



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు స్వాగతం పలుకుతున్న నానాజీ సోదరులు, కుటుంబ సభ్యులు

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డులో పాత ఆంధ్రా బ్యాంకు వద్ద నేతాజీ వీధి ఎదురుగా నూతనంగా నిర్మించిన సాయి స్వర్ణా ప్యాలెస్ బంగారు రిటైల్ షాపును నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం ప్రారంభించారు. 30 ఏళ్లుగా నరసన్నపేటలో బంగారం వ్యాపారం చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని పెంచుతూ వస్తున్న నానాజీ సోదరులు ఈ రిటైల్ షాపును పునర్నిర్మించారు. ప్రారంభోత్సవంలో నానాజీ సోదరులతో పాటు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, రాజాపు అప్పన్న, పాగోటి రాజారావు, వాన గోవిందరావు, కణిత కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వ్యాసరచన పోటీలు



పరీక్షను పర్యవేక్షిస్తున్న బి.మల్లేశ్వరరావు, శ్రీకాంత్, లక్ష్మణరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో శుక్రవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందింపజేసేందుకు ‘ఆచార్య దేవోభవ’ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని పెద్ద మందిరం సమితి పరిధిలో పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో శ్రీ సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, సేవాదల్ కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు పర్యవేక్షణలో జిల్లాలో వ్యాసరచన పరీక్షను ప్రశాంతంగా పూర్తి చేశారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ పోలుమహంతి శ్రీకాంత్, సత్యసాయి సేవాసమితి ప్రతినిధి అంపోలు లక్ష్మణరావు, భాస్కరశాస్త్రి, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలో శనివారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కార్యాలయం వర్గాలు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపాయి. విద్యాశాఖామంత్రి బొత్ససత్యనారా యణతో పాటు ఉపముఖ్యమంత్రి రాజన్నదొర పాల్గొనే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. శనివారం ఉదయం పాచిపెంట మండలంలోని విశ్వనాథపురం, సాలూరు మండలంలోని అన్నంరాజువలస, మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా ఉపముఖ్యమంత్రి పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి విద్యార్థులు


లక్ష్మీదేవి


భారతి

గంట్యాడ: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు గంట్యాడ మండలంలోని పెదవేమలి విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పాటుపు రెడ్డి భారతి ఖేలో ఇండియా నేషనల్ జూనియర్స్ కేటగిరిలో, సబ్ జూనియర్స్ కేటగిరిలో సిరపురపు లక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగిన సెలక్షన్స్‌లో ఎంపికైన వారు ప్రస్తుతం అక్కడ శిక్షణ పొందుతున్నారు. అక్టోబర్ 6,7,8 తేదీల్లో తమిళనాడులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నేపథ్యంలో భారతి, లక్ష్మీదేవిలకు పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అభినందనలు తెలియజేశారు.

అక్రమంగా మందులు విక్రయించిన ముద్దాయికి జైలు

విజయనగరం ఫోర్ట్: అక్రమంగా మందులు నిల్వ ఉంచి విక్రయించిన నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానాను జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి రజని విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2015వ సంవత్సరంలో లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నారన్న సమాచారంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లు యుగంధర్ రావు, కల్యాణి ఆకస్మిక తనిఖీ చేయగా గజపతినగరంలోని బీవీ.నారాయణ రాజేశ్వరరావు నిల్వ ఉంచిన మందులు బయటపడడంతో స్వాధీనం చేసుకుని విజయనగరం అడిషనల్ డిస్ట్రిక్ కోర్టులో కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు విన్న తరువాత నేరం నిరూపణ కావడంతో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జి.రజని పైవిధంగా తీర్పు వెలువరించారు. ఈకేసులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతపల్లి అప్పారావు వాదించారు.

దొంగలా మారిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి

రాజాం సిటీ: ఇంజినీరింగ్ చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడిన శ్రీకాకుళం మండలం కరజాడ గ్రామానికి చెందిన బలగ హరిబాబు దొంగలా మారాడు. జల్సాలతో పాటు బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు పడ్డాడు. ఈ క్రమంలో దొంగతనాలవైపు తన దృష్టి మళ్లించాడు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. ఓ కేసులో వరంగల్ పోలీసులు అరెస్టు చేసి విడుదల చేసిన అనంతరం హరిబాబు శ్రీకాకుళం వచ్చాడు. అక్కడ తెలిసిన వారి వద్ద రూ.6 లక్షల వరకు అప్పులు చేసి వాటిని తీర్చేందుకు దొంగతనాన్ని ఎంచుకుని తన మేనత్త ఇంట్లోనే చోరీకి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా మరికొన్ని నేరాలకు పాల్పడి శ్రీకాకుళంలో పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. శిక్ష అనుభవించి ఆగస్టు 23న విడుదలై వచ్చాడు. ఈ నెల 18న రాజాంలోని వాసవినగర్‌లో నివాసం ఉంటున్న జి.సిగడాం మండలం ఎందువ గ్రామానికి చెందిన గొద్దు వెంకటరమణ ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు నెక్లెస్‌లు, చెవి దిద్దులు, గాజులు, హారాలతోపాటు నగదు పట్టుకుపోయాడు. అక్కడినుంచి విశాఖపట్నం వెళ్లి ఐఐఎఫ్ఎల్ బ్యాంకులో నాలుగు గాజులు, ఒక హారం తాకట్టుపెట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు చేపట్టిన దర్యాప్తులో భాగంగా నిందితుడిని రణస్థలం సమీపంలో పట్టుకుని 241 గ్రాముల బంగారం, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నామన్నారు.

సువర్ణముఖిలో వృద్ధుడి గల్లంతు

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామసమీపంలో ఉన్న సువర్ణముఖి నదిలో వృద్ధుడు సూరిమల్లి సూర్యనారాయణ (75) శుక్రవారం గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు వెల్లడించిన ఎప్పటిలాగే సూర్యనారాయణ నదిలో చేపలవేటకోసం వెళ్లి కాలుజారి కొట్టుకుపోయాడు. సింహాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.జనార్దనరావు తెలిపారు.

దబ్బ కొట్టిన ధర


కొనుగోలు చేసిన పుట్ట దబ్బకాయలను వ్యాన్‌లో తరలించడానికి సిద్ధం చేసిన వ్యాపారులు

- కావిడ కాయలు రూ.200, 300కు విక్రయం
- కొండపోడు వ్యవసాయంలో సాగు
- సీతంపేట ఏజెన్సీలోనే అధిక దిగుబడి
- 500 ఎకరాల్లో పంట
- మైదాన ప్రాంతాల్లో డిమాండ్

సీతంపేట: స్థానిక మార్కెట్‌లోకి పుట్టదబ్బ వచ్చేసింది. ఏటా ఈ సీజన్‌లో లభించే ఈ పంటకు మన్యంలో మంచి డిమాండ్ ఉంది. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేని ఈ పంటను పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా సీతంపేట ఏజెన్సీలో సుమారు 5 వందల ఎకరాల్లో కొండపోడు వ్యవసాయంలో భాగంగా పండిస్తారు. అయితే ఆరుగాలం శ్రమించి పండించిన పంట తక్కువ ధరకు ఈ సంవత్సరం విక్రయించాల్సి వస్తోందని గిరిజనరైతులు వాపోతున్నారు. కావిడ దబ్బ రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నామని చెబుతున్నారు. ఒక కావిడలో సరాసరి 40 వరకు దబ్బకాయలు ఉంటాయి. ఒక్కొక్కటి రూ.5 ధర పడుతుంది. వ్యాపారులు ఒడిశాతో పాటు ఇతర పట్టణాల్లో రూ.10 వరకు కాయను విక్రయిస్తారు. గతేడాది ఇదేసీజన్‌లో ఒక్కో కావిడ రూ.500 వరకు పలికిందని గిరిజనులు చెబుతున్నారు. ఈ సంవత్సరం ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వాపోతున్నారు. హడ్డుబంగి, సోమగండి, గొయిది, శంభాం, కుశిమి, పెదరామ తదితర పంచాయతీల పరిధిలో దబ్బ ఎక్కువగా పండుతుంది.

సిండికేట్ అవుతున్న వ్యాపారులు

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలుకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి అబ్బ కొనుగోలు చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. ఎక్కువగా ఇవి పచ్చళ్ల తయారు చేసే చిన్నతరహా కంపెనీలకు విక్రయిస్తామని వ్యాపారులు చెబుతున్నారు.


పుట్ట దబ్బకాయలు

గిరిజన రైతులు చెప్పిన ధరకు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరకే ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారీ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో వ్యాపారులకు ఇస్తారు. ఇలా కూడా గిరిజనులు నష్టాలు చవిచూడాల్సి వస్తోంది.

సేకరణ కష్టమే



పైనాపిల్, సీతాఫలం తర్వాత ఆదాయాన్ని ఇచ్చేది పుట్టదబ్బ పంట. శ్రమకు తగ్గ ఫలితం లేదు. వీటిని సేకరించడం కష్టమైన పని. కావిడలో మోసుకుని తీసుకువస్తాం. ఎక్కువగా వారపు సంతల్లో అమ్మకాలు చేపడతాం. ముఖ్యంగా సీతంపేట పెద్ద వారపు సంత కాబట్టి ఇక్కడికే ఆది, సోమవారాలు తీసుకువస్తాం.

సవర రాజ్‌కుమార్, గొయ్యిగూడ

మద్దతు ధర కల్పించాలి



పుట్టదబ్బకు మద్దతు ధర కల్పిస్తే బాగుంటుంది. మద్దతు ధర లేకపోవడంతో అనేక నష్టాలు చవిచూస్తున్నాం. దీంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేస్తున్నాం.

ఎస్.బంగారయ్య, పెద్దగూడ

రాష్ట్రస్థాయి పోటీలకు బొద్దాం విద్యార్థులు


రాజాం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రాజాం: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రాజాం మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన దాసరి భాస్కరరావు, జినగం జశ్వంత్‌లు జూనియర్ విభాగంలో, భైరి పురుషోత్తం, ఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్, మానెం షర్మిల సీనియర్ విభాగంలో టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. వారిని త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికచేసిందని పాఠశాల హెచ్‌ఎం చీపేన గురుమూర్తి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ త్రినాథరావు, పాఠశాల కార్యదర్శి వై.భాస్కరరావు, ఉపాధ్యాయ సిబ్బంది శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

కరాటే పోటీలకు వీరభద్రపురం విద్యార్థులు


కొత్తవలస: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్ రాజాబాబు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామానికి చెందిన గనివాడ సాయిచైతన్య, కర్రి నవీన్‌లు స్కూల్‌గేమ్స్‌లో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు అండర్-17 విభాగంలో ఎంపికైనట్లు ప్రధాన కోచ్ కె.రాజుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన విజయగనరంలో జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సాయిచైతన్య ఏపీ మోడల్ స్కూల్‌లో, నవీన్ స్థానిక సూర్యోదయ మోడల్ స్కూల్‌లో చదువుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు వీరఘట్టం విద్యార్థులు


పవన్‌తేజ


సంజన

వీరఘట్టం: శ్రీకాకుళంలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు సత్తాచాటారు. శుక్రవారం జరిగిన పోటీల్లో 3 కి.మీల పరుగు పందెంలో ఎం.పవన్‌తేజ ద్వితీయస్థానంలో నిలిచాడు, అలాగే 1500 మీటర్ల పరుగు పందెంలో పి.సంజన ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శిర్లాపు ఉమామహేశ్వరరావు తెలిపారు. నవంబర్ నెలలో పల్నాడు జిల్లాలో జరగనున్న అండర్-17 అథ్లెటిక్ మీట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బి.సాంబర, ఉపాధ్యాయులు కల్లూరి శివకుమార్, సుధీర్, గర్భాన శ్రీనివాసరావు తదితరులు పవన్‌తేజ, సంజనలను అభినందించారు.

గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ వెలికితీయాలి

- డీఈఓ ప్రేమ్‌కుమార్


క్రీడాకారులను అభిందిస్తున్న డీఈఓ, వ్యాయామ ఉపాధ్యాయులు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ ప్రేమ్ కుమార్ సూచించారు. ఈ మేరకు మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల, బాలికలకు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యను ప్రోత్సహిస్తున్నంతగా వ్యాయామ విద్యను వ్యాయామ ఉపాధ్యాయులు పోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీతానగరం ఉన్నత పాఠశాలకేంద్రంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 210 మంది క్రీడాకారులు అండర్ 17 స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారని తెలియజేశారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. ఎంఈఓ జి.సూరిదేముడు మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించడానికి, శరీర ఆరోగ్యపరిరక్షణకు క్రీడలు దోహద పడతాయన్నారు. విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి చూపడం మంచిపరిణామమని అభినందించారు. కార్యక్రమం లో ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

చీపురుపల్లి: పట్టణంలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీ కోసం అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎల్.విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పాలిసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ కాని మిగులు సీట్లకు మాత్రమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈఈ), మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబర్ 3లోగా తమ సర్టిఫికెట్లతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో స్పాట్ అడ్మిషన్‌కు హాజరవ్వాలని పేర్కొన్నారు. పదో తరగతి మార్క్స్' మెమో, కుల ధ్రువీకరణ, పదో తరగతి టీసీ, తండ్రి/తల్లితో బాటు విద్యార్థి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకురావాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8919620773, 9074378305 నంబర్లలో కళాశాల సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు శుక్రవారం తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి సీహెచ్.సురేష్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కనుగొన్నామని చెప్పారు. మృతుడు 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని, లేత గులాబీ రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, పూలతో లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. సంబంధీకులు ఎవరైనా తమను సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీలకు మౌనిక

- అక్టోబర్ 1 నుంచి సౌత్ ఆఫ్రికాలో జరగనున్న పోటీలు


అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మౌనిక

విజయనగరం: క్రీడల ఖిల్లాగా పేరుగాంచిన విజయనగరం జిల్లాలో మరో క్రీడా ఆణిముత్యం వెలుగులోకి వచ్చింది. టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన నగరంలోని కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన రెడ్డి మౌనిక అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అక్టోబర్ 1 నుంచి సౌత్ ఆఫ్రికా వేదికగా జరిగే అంతర్జాతీయ పోటీలకు రాష్ట్రం తరఫున పాల్గొనే అవకాశం దక్కించుకుంది. క్రీడాకారిణి ప్రయాణఖర్చుల కోసం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందజేశారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మౌనికను జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావులు అభినందించారు.

అండర్-19 జిల్లా ఫుట్‌బాల్ జట్లు సిద్ధం


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలుర జట్టు

- వచ్చే నెల 7 నుంచి చిత్తూరు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు


బాలికల జట్టు

విజయనగరం: అంతర్ జిల్లాల అండర్-19 బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు శుక్రవారం విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా..జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులను వివిధ అంశాల్లో పరీక్షించిన అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిని 18 మంది బాలురను, 18 మంది బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన ఇరు జట్ల క్రీడాకారులు వచ్చే నెల 7 నుంచి చిత్తూరు జిల్లా మదనపల్లెలో జరగనున్న అండర్-19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు పీడీలు, ఫుట్‌బాల్ కోచ్‌లు పర్యవేక్షించారు.

5వ తేదీన క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

- డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు


డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు

పార్వతీపురంటౌన్: డాక్టర్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో గల రాష్ట్ర క్రీడా అకాడమీలో ప్రవేశాలకు వచ్చేనెల 5వ తేదీన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో 12 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వారు పాల్గొ నడానికి అర్హులని పేర్కొన్నారు. 5వ తేదీ ఉదయం 9గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9052248464 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి


డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ స్కాలర్‌షిప్ ఎన్ఎంఎంఎస్ 2023 సంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల వివరాలు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలను తప్పులు లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్స్‌లో ఉండేవిధంగా పోర్టల్‌లో నవంబర్ 30లోగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల మోడల్ అధికారి డిసెంబర్ 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి వివరాల నమోదు తీరును చూడాలని సూచించారు. నమోదు చేసిన అప్లికేషన్ ప్రింట్ తీసి దాంతోపాటు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు, అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీని జతపరచి డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని చెప్పారు. జిల్లా మోడల్ అధికారి లాగిన్ ద్వారా వెరిఫై చేయించుకున్న అప్లికేషన్లకు మాత్రమే స్కాలర్‌షిప్ మంజూరవుతుందన్నారు. గత సంవత్సరాలలో ఈ పరీక్షకు ఎంపికై ప్రస్తుతం 10,11,12 తరగతులు చదువుతూ అర్హత కలిగిన ప్రతి విద్యార్థి ఈ ఏడాది రెన్యువల్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- జేసీ ఆర్.గోవిందరావు


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ గోవిందరావు

పాలకొండ: ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండలోని ఆర్డీవో కార్యాలయం ఆవరణలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి 55 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రానికి అర్జీదారులు తిరగకుండా తమ ప్రాంతంలోనే వినతులు స్వీకరించి వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ప్రభుత్వం రూపొందించిదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఎస్‌ఈ ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.డి నాయక్, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరి, నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుండెను పరిరక్షించుకోవాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

- ఎస్పీ దీపికా పాటిల్

విజయనగరం ఫోర్ట్: గుండెను పరిరక్షించుకోవడం ద్వారా ఎక్కువ కాలం జీవించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ దీపికా పాటిల్ కోరారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుమల మెడికవర్ ఆస్పత్రి, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా స్థానిక కోట జంక్షన్ వద్ద నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. గుండె సమస్యల పట్ల అలసత్వం వహించరాదన్నారు. 45 ఏళ్ల దాటిన వారు నిరంతరం వ్యాయమం చేయడంతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చన్నారు. అనంతరం తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించిన సదస్సులో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ కృష్ణకాంతి, పద్మకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెఏఎస్‌కు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో శుక్రవారం మాట్లాడారు. జేఏఎస్ శిబిరాల్లో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అందులో ఏడు రకాల పరీక్షలను ఇంటింటి సర్వేలో నిర్వహించినట్టు స్పష్టంచేశారు. సర్వేలో 1,03,482 మందికి మధుమేహం, 1,12,284 మందికి బీపీ, 1,20,149 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు జిల్లాలో 287 వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో 84 మంది స్పెషలిస్టు వైద్యులు పాల్గొంటార, శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.

గంజాయి, సారా రవాణాపై ఉక్కుపాదం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: గంజాయి, సారా రవాణాదారులపై ఉక్కుపాదం మోపాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ విధిగా నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కోర్టుల్లో విచారణకు వచ్చిన కేసులపై స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు సరైన సమాధానాలతో సిద్ధంగా ఉండాలన్నారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరవుతున్నారా లేదా, వారిని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా అన్న సమాచారాన్ని కోర్టు కానిస్టేబుల్ ద్వారా తెలుసుకొని సాక్షులకు భరోసా ఇవ్వాలన్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదుచేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు

లోక్‌అదాలత్‌లో అధిక కేసులు డిస్పోజల్ చేయడంలో కృషిచేసిన పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎం.రామారావు, రూరల్ కానిస్టేబుల్ ఎస్.దామోదరరావు, సాలూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్. పురుషోత్తమనాయుడుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. దిశ డీఎస్పీ ఎస్ఆర్ హర్షిత, పాలకొండ సబ్‌డివిజన్ డీఎస్పీ జీవీ కృష్ణారావు, పార్వతీపురం డీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్, ఎస్బీసీఐ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ బి.ప్రభాకరరావు పాల్గొన్నారు.